# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 208 శనివారం 3 ఫిబ్రవరి 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే దమ్ముందా?

- కేసీఆర్ పాపాల భైరవుడు.. జన్మలో మళ్లీ సీఎం కారు
- కేసీఆర్ కుటుంబం విధ్వంసం చేసింది..
- 15 రోజుల్లో 15వేల కానిస్టేబుళ్ల ఉద్యోగాలు..
- ఆ కృతజ్ఞతతోనే కాంగ్రెస్‌ను గెలిపించారు..
- పదేళ్లలో చేయనిది.. 2 నెలల్లో ఎలా సాధ్యం..
- మొత్తం దోచేశారు.. కేసీఆర్‌పై సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు..
- అందిన కాడికి దోచుకుని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి డబ్బులు లేకుండా చేశారు
- రూ. 7 లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా కేసీఆర్ కుటుంబం మిగిల్చింది

వాస్తవ నేస్తం, ఆదిలాబాద్

తన పాలనలో కేసీఆర్ ఏనాడూ ఆదివాసీ బిడ్డల గురించి ఆలోచించలేదని.. ఆలోచించి ఉంటే ఇవాళ నాగోబా ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వాల్సిన అవసరం ఎందుకు వచ్చేదని నిలదీశారు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి. శుక్రవారం సాయంత్రం ఇంద్రవెల్లిలో పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించిన ఆయన.. వేదిక నుంచి బీఆర్‌ఎస్‌పై, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "ఈ వేదిక సాక్షిగా చెబుతున్నా.. ఆదిలాబాద్ను దత్తత తీసుకుంటాం. ఈ అడవి బిడ్డల ఆదివాసీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి తీరుతాం. తప్పకుండా ఆదివాసీ కుటుంబాలను గుండెల్లో పెట్టుకుంటాం. ఇందిరమ్మ సోనియా రాజ్యం తెచ్చుకుంటాం. కేసీఆర్‌నును నేరుగా అడుగుతున్నా. ఎప్పుడైనా ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ బిడ్డల గురించి ఆలోచించారా?. నిజంగా అభివృద్ధి చేస్తే ఎందుకు నీళ్ళ కోసం నాగోబా గుడి కోసం -మిగతా3లో

## ప్రత్యేక పూజలు

ఇక.. తెలంగాణ ముఖ్యమంత్రి హెూదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి నాగోబాను దర్శించుకున్నారు. ఈ పూజల్లో డిప్యూటీ సీఎం విక్రమార్కతోపాటు మంత్రులు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.





# పోలీసుల వ్యూహాలకు ప్రతివ్యూహాలు

- మావోల సరికొత్త ఎత్తుగడ
- హెలికాప్టర్ దాడులు తిప్పికొట్టేలా కేడర్‌కు శిక్షణ
- షెల్టర్ జోన్ల కోసం బంకర్ల నిర్మాణం
- కొత్తగా స్నైపర్ టీమ్‌ల ఏర్పాటుకు కసరత్తు
- గతేడాదే వెలుగు చూసిన 80 పేజీల డాక్యుమెంట్

వాస్తవ నేస్తం, హైదరాబాద్

ఛత్తీస్‌గఢ్ అడవుల్లో బంకర్ వెలుగు చూసిన నేపథ్యంలో మావోయిస్టులు సరి కొత్త ఎత్తుగడలు అనుసరిస్తున్నట్లు తెలిసింది. దశాబ్దంన్నర కాలంగా బస్తర్ అడవుల్లో మావోయిస్టులు నిర్వహిస్తున్న జనతన సర్కార్‌ను నిర్వీర్యం చేసేందుకు భద్రతాదళాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. వందల సంఖ్యలో క్యాంపులు ఏర్పాటు చేస్తూ, ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ క్రమంగా అడవులపై పట్టు సాధిస్తున్నాయి. దీంతో పోలీసుల వ్యూహాలకు ప్రతివ్యూహాలు అమలు చేసే పనిలో -మిగతా3లో

# తెలంగాణలోనూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్?




- 10న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- 12వ తేదీ నుంచి 5 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం

వాస్తవ నేస్తం, హైదరాబాద్

తెలంగాణ శాసనసభ సమావేశాలు ఫిబ్రవరి 12న ప్రారంభం కానున్నట్లు తెలిసింది. సభ ఎన్ని రోజులు జరగాలనేది బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశం తర్వాత నిర్ణయిస్తారు. కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో రాష్ట్రం కూడా అటు వైపే మొగ్గు చూపనున్నట్టు తెలుస్తోంది. ఈ నెల 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని సమాచారం. ఈ సమావేశాల్లో భాగంగా పూర్తిస్థాయి బడ్జెట్ పెడతారా? ఓటాన్ అకౌంట్‌కు వెళతారా అన్న దానిపై ఇంకా -మిగతా3లో



## అలాంటి వాళ్లు కాంగ్రెస్ వీడాలనుకున్నా

- వారు పార్టీ నుంచి వెళ్లిపోవటం వల్ల ఇబ్బంది ఏం లేదు
- వారి పార్టీ మార్పు సరైందే
- అతని వంటి వ్యక్తి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు సరిపోడు
- అతను ముస్లింలపై చేసిన వ్యాఖ్యలు అందుకు నిదర్శనం
- కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ

# కాంగ్రెస్ గెలవలేదు

- బీఆర్‌ఎస్ పార్టీనే ఓడిపోయింది: కిషన్ రెడ్డి
- కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్న కిషన్ రెడ్డి
- యువతను మోసం చేస్తోందని మండిపాటు
- హామీలను వ్యూహాత్మకంగా దాటవేసే ప్రయత్నం చేస్తోందని విమర్శ
- గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇంకా రాలేదేం?: కిషన్ రెడ్డి మండిపాటు
- హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ఫెయిల్ అయిందంటూ ట్వీట్
- ఫిబ్రవరి 1న గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎన్నికలకు ముందు ప్రకటనలు ఇచ్చిందన్న కిషన్ రెడ్డి
- నమ్మి ఓటు వేసిన యువతను కాంగ్రెస్ నిండా ముంచిందని ఆరోపణ



వాస్తవ నేస్తం, హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవలేదని... బీఆర్ ఎస్ పార్టీనే ఓడిపోయిందని కేంద్ర మంత్రి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ పై కోపంతోనే ప్రజలు కాంగ్రెస్ ను ఎన్నుకున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారం సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అవినీతి గురించి రేవంత్ మాట్లాడారని... కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వీరిపై చర్యలు తీసుకుంటామని చెప్పారని... కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంత మాత్రాన పాలనలో తేడా ఉంటుందని తాను అనుకోవడం లేదని అన్నారు. యువతను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీలను వ్యూహాత్మకంగా దాటవేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తన నిజ స్వరూపాన్ని బయట పెట్టుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో బీఆర్ఎస్ -మిగతా3లో

# ఏకధాటిగా 40 గంటలు ఎగిరే డ్రోన్..

## అమెరికాతో బిగ్ డీల్ ఓకే..



భారత సైన్యంలోకి అత్యాధునిక డ్రోన్స్

- భారత్‌కు 31 ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్లను విక్రయించేందుకు బైడెన్ ప్రభుత్వం ఆమోదం
- అమెరికా కాంగ్రెస్‌కు నోటిఫై చేస్తూ అవసరమైన ధ్రువీకరణ అందజేత
- ఆ డ్రోన్ల వల్ల మరింత బలోపేతం కానున్న భారత రక్షణ సామర్థ్యం
- సముద్ర మార్గాల్లో గస్తీ, నిఘా మెరుగుపడుతుంది

# మాల్దీవులకు పాక్ ఆర్థిక సాయం దేనికి?

మాల్దీవులకు భారత్‌కు నడుమ దౌత్యపరమైన విభేధాలు కొనసాగుతున్నాయి. ఈ గ్యాప్‌ను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు చైనా ప్రయత్నిస్తోంది. మాల్దీవులతో సన్నిహిత సంబంధాలను ఏర్పరుచుకుంటోంది. అదే సమయంలో పాకిస్థాన్ సైతం మాల్దీవులకు ఆర్థిక సాయం అందిస్తుందట. అసలు పాక్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే మాల్దీవులకు ఆర్థిక సాయం ఎలా చేస్తుందో?. మాల్దీవులతో దౌత్యపరమైన విభేదాలు నెలకొన్న తరుణంలోనూ భారత్ ఆ దేశానికి ఆపన్నహస్తం అందించడానికి మొగ్గుచూపిన విషయం తెలిసిందే. గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో మాల్దీవులకు ఆర్థిక సాయం కింద రూ.600 కోట్లు కేటాయించింది. అయితే గతంతో పోల్చితే కొంత మొత్తంలో ఆర్థిక సాయం తగ్గింది. అయితే.. ఇదే క్రమంలో దాయాది దేశమైన పాకిస్తాన్ సైతం మాల్దీవులకు ఆర్థికసాయం చేయడానికి ముందుకు వచ్చింది. మాల్దీవుల అభివృద్ధి అవసరాలకు తాము సాయం



అందిస్తామని పాకిస్తాన్ ఆపద్ధర్మ అధ్యక్షుడు అన్వర్ ఉల్ హక్ కాకర్ పేర్కొన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా పాక్ అధ్యక్షుడు అన్వర్.. మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జుకు ఫోన్ చేసి మరీ ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని పాక్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. పాక్ ప్రభుత్వం తమ దేశ అభివృద్ధి కోసం నిధులు అందించనుందని తెలిపినట్లు మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జు సైతం పేర్కొన్నారు. ఇరు దేశాల నేతలు అంతర్జాతీయ అంశాల్లో తమ దేశాల మధ్య అభివృద్ధికి సంబంధించిన విషయాలను చర్చించుకున్నట్లు తెలుస్తోంది. వాతావరణ మార్పులకు సంబంధిచిన విషయంలో కూడా మాల్దీవులకు ఆర్థిక సాయంతో పాటు తమ? పూర్తి మద్దతు ఉంటుందని పాక్ అధ్యక్షుడు పేర్కొన్నట్లు సమాచారం. ఇక.. ఈ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు 26, జూలై 1996 నుంచి కొనసాగుతున్నాయి. ఇరు దేశాలు కూడా చైనాకు అనుకూలమైన దేశాలుగా గుర్తింపు ఉండటం గమనార్హం. మరోవైపు పాకిస్తాన్ దేశమే ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే మాల్దీవులకు ఆర్థిక సాయం ఎలా చేస్తుందని అక్కడి ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు తెలుస్తోంది.

# ఏకధాటిగా 40 గంటలు ఎగిరే డ్రోన్..

**వాషింగ్టన్:** భారత్‌కు అగ్రరాజ్యం అమెరికా శుభవార్త అందించింది. భారత్‌కు 31 ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్లను విక్రయించేందుకు బైడెన్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు అమెరికా కాంగ్రెస్‌కు నోటిఫై చేస్తూ అవసరమైన ధ్రువీకరణను అందజేసినట్లు రక్షణ భద్రత సహకార సంస్థ (డీఎస్‌సీఏ) పేర్కొంది. వివరాల ప్రకారం.. అమెరికా, భారత్ మధ్య ప్రిడేటర్ డ్రోన్లపై ఒప్పందం చివరి దశకు చేరుకుంది. దాదాపు 4 బిలియన్ల డాలర్ల విలువైన ఒప్పందంలో భారత్‌కు ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్ల అమ్మకానికి అమెరికా ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదిత విక్రయం అమెరికా-భారత వ్యూహాత్మక సంబంధాన్ని బలోపేతం చేయడానికి, రాజకీయ స్థిరత్వం, శాంతికి ముఖ్యమైన శక్తిగా కొనసాగనుంది.

భారత్‌తో ప్రధాన రక్షణ భాగస్వామి భద్రతను మెరుగుపరచడంలో సహాయం చేయడం ద్వారా యునైటెడ్ స్టేట్స్ విదేశాంగ విధానం, జాతీయ భద్రతా లక్ష్యాలకు మద్దతు ఇస్తుందని డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ తెలిపింది. ఇదిలా ఉండగా.. గతేడాది ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా 31 ఎంక్యూ-9బీ స్కై గార్డియన్ డ్రోన్‌లను కొనుగోలు చేయాలని భారత్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఇక, అమెరికా నిర్ణయంతో ఈ మెగా ఒప్పందం ఖరారు దిశగా పెద్ద ముందడుగు పడింది. ఆ డ్రోన్ల వల్ల భారత రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కానుంది. సముద్ర మార్గాల్లో గస్తీ, నిఘా మెరుగుపడుతుంది. మరోవైపు.. ఈ ప్రతిపాదిత ఒప్పందం కింద భారత్.. తన నౌకాదళం కోసం 15 సీ గార్డియన్ డ్రోన్లు, వైమానిక దళం, సైన్యం కోసం ఎనిమిదేసి చొప్పున స్కై గార్డియన్ డ్రోన్లను సమకూర్చుకోనుంది. కాగా, భారత నౌకాదళం ఇప్పటికే రెండు సీ గార్డియన్ డ్రోన్లను ఉపయోగిస్తోంది.

**ఇంకెన్నో ప్రత్యేకతలు**

అమెరికా, భారత్ మధ్య 'ఎంక్యూ-9బీ ప్రిడేటర్ డ్రోన్ల'పై



ఒప్పందం చివరి దశకు చేరుకుంది. దాదాపు 4 బిలియన్ల డాలర్ల(రూ.33 వేలకోట్లు) విలువైన ఒప్పందంలో భారత్‌కు ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్ల అమ్మకానికి అమెరికా ఆమోదం తెలిపింది. ఈ డీల్ అమెరికా-భారత వ్యూహాత్మక సంబంధాన్ని బలోపేతం చేయనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఎంక్యూ-9బీ ప్రిడేటర్ డ్రోన్ల ప్రత్యేకతలు ఇవే..**

సముద్రపు నిఘా కోసం సీ గార్డియన్ డ్రోన్లు, భూసరిహద్దు పరిరక్షణ నిఘా కోసం స్కై గార్డియన్ డ్రోన్లను ప్రత్యేకంగా వినియోగించుకోవచ్చు. ఈ సాయుధ డ్రోన్లకు ప్రత్యేక సామర్థ్యాలు ఉంటాయి. ఫైటర్‌జెట్‌లు చేయగలిగే పనులు సైతం ఇవి చేస్తాయి. వీటికి హెల్‌ఫైర్ క్షిపణులు అమర్చి ఉంటాయి. శత్రువులను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, మందుగుండు సామగ్రితో విధ్వంసం సృష్టిస్తాయి. ఈ డ్రోన్లను నిఘా సామర్థ్యం ఉంటుంది. మానవతా సహాయం, విపత్తుల సమయంలో రక్షణ చర్యలు, గాలింపు చర్యలు, గాలో ముందస్తు హెచ్చరికలు, ఎలక్ట్రానిక్ వార్‌పేర్, యాంటీ సర్ఫేస్ వార్‌ఫేర్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌ల్లో ఈ డ్రోన్లను ఉపయోగించవచ్చు. మాదకద్రవ్యాల అక్రమరవాణా, పైరసీ వంటి పరిస్థితులను ఎదుర్కొవడానికి కూడా ఈ డ్రోన్లను మోహరించవచ్చు. ఇదీ చదవండి: జనవరిలో 'తయారీ'కి కొత్త ఆర్డర్ల బూస్ట్ అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ ఏకధాటిగా 30 నుంచి 40 గంటలపాటు ఈ డ్రోన్లు గాల్లో ఎగరగలవు. 40,000 అడుగుల ఎత్తు వరకు ఎగిరే సామర్థ్యం వీటికి ఉంటుంది.

# ప్రపంచంలోనే అరుదైన పాస్ పోర్ట్!

**500 మందికి మాత్రమే జారీ**

**మొత్తం 120 దేశాలలో గుర్తింపు**

**'ది సావరిన్ మిలిటరీ ఆర్డర్ ఆఫ్ మాల్టా' విశేషాలు**

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్ పోర్ట్ గా జపాన్ పాస్ పోర్ట్ నిలవగా.. అరుదైన పాస్ పోర్ట్ గా 'ది సావరిన్ మిలిటరీ ఆర్డర్ ఆఫ్ మాల్టా' పాస్ పోర్ట్ గుర్తింపు పొందింది. అంతర్జాతీయ ప్రయాణం నిమిత్తం ప్రపంచంలోని ఏ దేశమైనా తన పౌరులకు జారీ చేసే గుర్తింపు పత్రమే పాస్ పోర్ట్.. అయితే, భౌతికంగా ఎలాంటి ఉనికి లేకపోయినా పాస్ పోర్టులు జారీ చేయడం, వాటికి 120 దేశాలు గుర్తించడం 'ది సావరిన్ మిలిటరీ ఆర్డర్ ఆఫ్ మాల్టా'కు మాత్రమే ఉన్న ప్రత్యేకత. వాస్తవానికి ది సావరిన్ మిలిటరీ ఆర్డర్ ఆఫ్ మాల్టాను నిర్వచించడం కూడా కష్టమే.. వేల సంవత్సరాల నుంచి అస్తిత్వం నిలబెట్టుకుంటూ వస్తున్న క్యాథలిక్ వ్యవస్థ.. వైద్య సాయం అందించే సంస్థగా.. అంతర్జాతీయ దౌత్య గుర్తింపు పొందిన సంస్థగా కూడా చెప్పవచ్చు. సులభంగా చెప్పాలంటే కాస్త అటూ ఇటూగా ఇప్పుడున్న ఐక్యరాజ్య సమితిలాంటి సంస్థ. ఓ దేశంలాగే 'ది సావరిన్ మిలిటరీ




ఆర్డర్ ఆఫ్ మాల్టా' వ్యవహరిస్తుంది. భౌతిక సరిహద్దులు లేకున్నా రాచరికపు హోదాలు, వివిధ పదవులు, ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలు, గుర్తింపు ఈ సంస్థకు ఉన్నాయి. క్రీ.శ.1300 సంవత్సరం నుంచి ఈ పాస్ పోర్ట్ లు జారీ చేస్తున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. తమ సంస్థ సభ్యులకు జారీ చేసే ఈ పాస్ పోర్టులను ప్రస్తుతం ప్రపంచంలోని 120 దేశాలు గుర్తిస్తుండగా.. 113 దేశాలు వీటిని ప్రయాణ అనుమతి పత్రాలుగా అంగీకరిస్తున్నాయి. అంటే 'ది సావరిన్ ఆర్డర్ ఆఫ్ మాల్టా' పాస్ పోర్టు ఉన్న వారిని తమ దేశంలోకి అనుమతిస్తున్నాయి. ది సావరిన్ మిలిటరీ ఆర్డర్ ఆఫ్ మాల్టాకు ఓ దేశానికి ఉన్నట్లే గుర్తింపు, ఐక్యరాజ్య సమితి అబ్జర్వర్ హోదా, సొంత రాజ్యాంగం కూడా ఉన్నాయి.. లేనిదల్లా భూమి మాత్రమే. భూమి లేదు.. రోడ్లు లేవు అయినా కూడా కార్లకు లైసెన్స్ ప్లేట్ జారీ చేస్తుంటుంది. సొంతంగా కరెన్సీ, స్టాంపులను ముద్రిస్తుంటుంది. పూర్వకాలంలో రాజు, చక్రవర్తి తరహాలో ఓ గ్రాండ్ మాస్టర్ కూడా ఉంటారు. ఐదేళ్లకు ఓసారి గ్రాండ్ మాస్టర్ ను సావరిన్ కౌన్సిల్ ఎన్నుకుంటుంది. సావరిన్ కౌన్సిల్ లో వివిధ దేశాలకు చెందిన పౌరులు ఉన్నారు. వీరికి తమ దేశ పౌరసత్వంతో పాటు ది సావరిన్ మిలిటరీ ఆర్డర్ ఆఫ్ మాల్టా పౌరసత్వం కూడా ఉంది. ప్రస్తుత గ్రాండ్ మాస్టర్ జాన్ టి. డన్లాప్ ప్రిన్స్ కెనడా పౌరుడు. 2022 న గ్రాండ్ మాస్టర్ గా ఎన్నికైన జాన్.. 2027 వరకు (ఐదేళ్లు) ఆ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత మరోసారి ఎన్నికయ్యేందుకు (గరిష్ఠంగా రెండుసార్లు) అవకాశం ఉంటుంది.

# కేంద్రానికి కోట్లు సంపాదించి పెడుతున్న ఆర్‌బీఐ!

కేంద్ర ప్రభుత్వానికి ఏటా భారీ డివిడెండ్ చెల్లించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకొస్తునే ఉంటుంది. తమ వద్ద ఉన్న మిగులు నిధుల నుంచి రూ.87,416 కోట్లు డివిడెండ్‌గా చెల్లించేందుకు ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ బృందం గతేడాది మే నెలలో ఆమోదం తెలిపింది. 2022తో పోలిస్తే ఈ మొత్తం మూడింతలు అధికం కావడం గమనార్హం. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ ఆర్‌బీఐ, ప్రభుత్వ ఫైనాన్షియల్ సంస్థల (బ్యాంకుల) నుంచి రూ.1.02 లక్షల కోట్ల డివిడెండ్ రానుందని బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.04 లక్షల కోట్ల డివిడెండ్ ఆదాయాన్ని ప్రభుత్వం పొందే అవకాశం ఉంది. ఇది కిందటేడాది బడ్జెట్‌లో వేసిన అంచనా రూ.48 వేల కోట్ల కంటే చాలా ఎక్కువ.

కేంద్ర సంస్థల నుంచి భారీ డివిడెండ్..

సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ (సీపీఎస్‌ఈ)ల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.43 వేల కోట్ల డివిడెండ్ ఆదాయం వస్తుందని బడ్జెట్ అంచనా వేసింది. అంతకు




ముందు ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ, ప్రభుత్వ ఫైనాన్షియల్ సంస్థల నుంచి రూ.39,961 కోట్ల డివిడెండ్‌ను కేంద్రం అందుకుంది. మొత్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్‌బీఐ, ప్రభుత్వ బ్యాంకులు, ఇతర గవర్నమెంట్ కంపెనీల నుంచి కేంద్రానికి రూ.1,54,407 కోట్ల డివిడెండ్ ఆదాయం రాబోతుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2024-25లో ఈ మొత్తం డివిడెండ్ రూ.1.50 లక్షల కోట్లు అందుతుందని తెలిసింది.

## దారుణం: 12 ఏళ్లుగా ఆమెకు ఇల్లే జైలు

**బెంగళూరు:** శాస్త్రసాంకేతికతతో మనిషి అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్న కాలం మనదని చెబుతాం. స్త్రీలు సగర్వంగా తిరిగగలిగే సమాజంలో ఉన్నామని అనుకుంటాం. కానీ కర్ణాటకలో జరిగిన ఓ ఘటనను చూస్తే అవన్నీ ప్రసంగాలకే పరిమితమవుతున్నాయా? అని ప్రశ్నించుకోకతప్పదు! కర్ణాటకాలో ఓ మహిళకు పుష్కరకాలంగా ఇల్లే కారాగారంగా మారింది. కర్ణాటకాలోని మైసూరులో దారుణం వెలుగులోకి వచ్చింది. 12 ఏళ్లుగా ఓ అనుమానపు భర్త తన భార్యను ఇంట్లోనే బంధించాడు. భర్త



పనికి వెళ్లే ముందు తనను ఇంట్లో ఉంచి తాళం వేసుకుని వెళతాడని మహిళ(32) పోలీసులకు తెలిపింది. మరుగుదొడ్డి కోసం ఇంట్లో చిన్న బాక్స్‌ను ఉపయోగించానని ఆవేదన వ్యక్తం చేసింది. పిల్లలు పాఠశాల నుంచి వచ్చినా భర్త ఇంటికి వచ్చేవరకు లోపలికి అనుమతి ఉండదని తెలిపింది. కిటికీ నుంచే పిల్లలకు భోజనం అందిస్తానని కన్నీరు పెట్టుకుంది. "నాకు పెళ్లయి 12 ఏళ్లైంది.. నన్ను ఎప్పుడూ ఇంట్లో బంధించి చిత్రహింసలు పెట్టేవాడు. ఆ ప్రాంతంలో ఆయన్ని ఎవరూ ప్రశ్నించరు. నా పిల్లలు స్కూల్‌కి వెళతారు. కానీ నా భర్త పని నుంచి వచ్చే వరకు బయటే ఉంటారు. నేను వారికి కిటికీలోంచి ఆహారం ఇస్తాను. నా తల్లిదండ్రుల ఇంటికి ఎప్పుడు వెళ్లానో కూడా సరిగా గుర్తులేదు." అని పోలీసులకు మహిళ తెలిపింది. అయితే.. భర్తపై కేసు పెట్టడానికి మాత్రం బాధిత మహిళ ఇష్టపడలేదు. తన తల్లిదండ్రుల ఇంటి వద్దే ఉంటానని పోలీసులకు తెలిపింది. అక్కడి నుంచే వివాహ సమస్యలను పరిష్కరించుకుంటానని పేర్కొంది. భర్తకు బాధిత మహిళ మూడో భార్య. గత మూడు వారాలుగా ఆమె ఇంట్లోనే ఉండటం గమనించామని పోలీసులు తెలిపారు. ఆమె కదలికలపై పూర్తి నిషేధం ఉంచినట్లు గుర్తించామని వెల్లడించారు. పనికి వెళ్లే ముందు ఆమెను ఇంట్లో ఉంచే తాళం వేయడం తాము గమనించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమెను రక్షించామని, తల్లిదండ్రుల వద్దకే మహిళ వెళ్లడానికి ఇష్టపడినట్లు తెలిపారు. భర్తకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## అలాంటి వాళ్లు కాంగ్రెస్ వీడాలనుకున్నా



**కోల్‌కతా:** కాంగ్రెస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉండేవారు తమ పార్టీలో నుంచి వెళ్లిపోయినా తమకు ఎటువంటి ఇబ్బంది లేదని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. శుక్రవారం రాహుల్ గాంధీ తాను చేపట్టిన 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో 'డిజిటల్ మీడియా వారియర్స్' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అస్సాంలో కాంగ్రెస్ పార్టీ పతనం, ఆ రాష్ట్ర సీఎం హిమంత బిశ్వ శర్మ గురించి అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ.. హిమంత, మిలింద్ దేవరా వంటి వ్యక్తులు కాంగ్రెస్‌కు విడిచిపెట్టాలకున్నానని తెలిపారు. వారు పార్టీ నుంచి వెళ్లిపోవటం వల్ల ఇబ్బంది ఏం లేదన్నారు. వారి పార్టీ మార్పు సరైందేనని తెలిపారు. హిమంత విచిత్రమైన రాజకీయనాయుడని.. అతని వంటి వ్యక్తి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు సరిపోడని అన్నారు. అతను ముస్లింలపై చేసిన వ్యాఖ్యలు అందుకు నిదర్శనమని తెలిపారు. తాను రక్షించాలనుకుంటున్న విలువలకు అతని వ్యాఖ్యలు చాలా వ్యతిరేకమని చెప్పారు. ఇటీవల అస్సాం సీఎం హిమంత, రాహుల్ గాంధీ.. తీవ్రమైన విమర్శ, ప్రతివిమర్శలకు దిగిన విషయం తెలిసిందే. రాహుల్ 'భారత్ జోడో న్యాయ యాత్ర' ద్వారా అస్సాంలో అలజడి సృష్టించాలని చూశారని విమర్శించారు. దీంతో అత్యంత అవినీతిపరుడైన సీఎం.. హిమంత అని రాహుల్ గాంధీ మండిపడ్డ విషయం తెలిసిందే. ఇటీవల మహారాష్ట్రలో కీలక నేత అయిన మిలింద్ దేవరా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన విషయం తెలిసిందే. ముంబై సౌత్ నియోజకవర్గానికి సంబంధించి.. ఇండియా కూటమి సీట్ల పంపకాల్లో అసంతృప్తికి గురై పార్టీ మారిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన విలువలు లేని అటువంటి నేతలు వెళ్లిపోవటం అనేది ప్రతిపక్ష ఇండియా కూటమిపై కూడా ఎటువంటి ప్రభావం పడదని రాహుల్ గాంధీ తెలిపారు.

## హేమంత్ సొరెన్‌కు అండగా నేనున్నా: మమతా బెనర్జీ



**కోల్‌కతా:** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్ అరెస్టును పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఖండించారు. హేమంత్ సొరెన్ శక్తివంతమైన గిరిజన నాయకుడని అన్నారు. సొరెన్ తన సన్నిహిత మిత్రుడని చెప్పారు. సొరెన్‌కు మద్దతుగా నిలుస్తానని ట్వీట్ చేశారు. "శక్తివంతమైన ఆదివాసీ నాయకుడైన హేమంత్ సొరెన్‌ను అన్యాయంగా అరెస్టు చేశారు. బీజేపీ మద్దతు ఉన్న కేంద్ర ఏజెన్సీల ప్రతీకార చర్య. ప్రజాభిప్రాయంతో ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని అణగదొక్కడానికి కుట్ర జరుగుతోంది. ఈ క్లిష్ట సమయాల్లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి సొరెన్ పక్షాన నిలబడతానని ప్రతిజ్ఞ చేస్తున్నా. ఈ యుద్ధంలో ప్రజలు అద్భుతమైన స్పందన అందజేస్తారు. విజయం సాధిస్తారు." అని మమతా బెనర్జీ ట్విట్టర్(ఎక్స్) ?లో పేర్కొన్నారు. హేమంత్ సొరెన్ అరెస్టుకు వ్యతిరేకంగా నేడు పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఇండియా కూటమి నిరసన వ్యక్తం చేసింది. సమావేశాల నుంచి వాకౌట్ చేశారు. టీఎంసీకి చెందిన ఎంపీలు కూడా పార్లమెంట్ రెండు సభల నుంచి వాకౌట్ చేశామని ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ తెలిపారు. రాష్ట్ర మాజీ హేమంత్ సొరెన్‌ను బుధవారం ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. గురువారం రాంచీలోని 'ప్రత్యేక మనీ లాండరింగ్ నిరోధక చట్టం కోర్టు'లో ప్రవేశపెట్టారు. తదుపరి విచారణ నిమిత్తం సొరెన్‌ను 10 రోజులపాటు ఆయనను తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం తమ తీర్పును శుక్రవారానికి రిజర్వ్ చేసింది. అలాగే సొరెన్‌ను ఒకరోజుపాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టును హేమంత్ సొరెన్ ఆశ్రయించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీం స్పష్టం చేసింది.

# హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు ఇక్కడా అదే గతి పడుతుంది

తెలంగాణకు శ్రీరామరక్ష బీఆర్ఎస్ పార్టీనే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు వాటి స్వార్థం కోసమే పనిచేస్తాయని.. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ ప్రయోజనాల కోసమే పోరాడుతుందని తెలిపారు. శుక్రవారం నిర్వహించిన భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ కారకర్తల సమావేశంలో హరీశ్ పాల్గొని ప్రసంగించారు. కర్ణాటక కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరిస్తున్నారని.. అక్కడి 25 ఎంపీ సీట్లలో నాలుగైదు మాత్రమే వస్తాయని అంటున్నారని హరీశ్ రావు తెలిపారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు ఇక్కడ కూడా అదే గతి పడుతుందని విమర్శించారు. మనం భయపడాల్సిన అవసరం లేదని.. భవిష్యత్తు తమదేనని బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమం కోసం పనిచేశామని.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ప్రజల కోసమే కొట్లాడదామని పిలుపునిచ్చారు. అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా తాము ప్రజల పక్షమని స్పష్టం చేశారు. ఓటమి శాశ్వతం కాదు. గెలుపుకు నాంది అని హరీశ్‌రావు తెలిపారు. ఇది స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని అన్నారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రచారంలో అబద్ధాలు మాట్లాడిన కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి వచ్చాక అసహనం పెరిగిందని విమర్శించారు. రైతుబంధు పడటం లేదని జడ్పీ చైర్మన్‌గా బాధ్యతతో సందీప్ రెడ్డి అడిగితే ఆయనను పోలీసులతో బయటికి పంపించారని మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి నల్గొండపై ప్రేమ ఉంటే సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడాలని సూచించారు.. రైతు బంధు పడటం లేదని ప్రశ్నిస్తే చెప్పుతో కొట్టాలనడం ఏం సంస్కారం? అని నిలదీశారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులకు కేఆర్ఎంబీకి అప్పగించడం వల్ల నల్గొండకు తీవ్ర నష్టం జరుగుతుందని.. సాగునీళ్లు, తాగునీళ్లు ఉండవని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో బీఆర్ఎస్



గురించి పచ్చి అబద్ధాలు చెప్పిందని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య సంబంధం ఉందని దుష్ప్రచారం చేసిందని ఆరోపించారు. బండి సంజయ్, రఘునందన్ రావు, ఈటల రాజేందర్‌లను ఓడించింది కాంగ్రెస్ కాదు, బీఆర్ఎస్సే అని స్పష్టం చేశారు. ఇప్పుడు కూడా ఎన్నికల హామీలను తప్పించుకోవడానికి అసలు అప్పును రెట్టింపు చేసి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని అన్నారు.. నర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం.. కాంగ్రెస్ అపాయింట్‌మెంట్ మాత్రమే ఇచ్చింది. అని అన్నారు. ఫిబ్రవరి 1న గ్రూప్ 1 నోటిఫికేషన్ ఎందుకివ్వలేదో జవాబు చెప్పాలని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల రైతు రుణమాఫీ ఎందుకు చేయలేదని నిలదీశారు. కార్యకర్తలందరూ కష్టపడాలని.. ఎంపీ సీటు మనదేనని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో కష్టపడి పోరాడి సత్తా చూపిద్దామని పిలుపునిచ్చారు.

వృద్ధులకు, వికలాంగులకు ఫించన్ 4 వేలకు పెంచలేదని.. 2వేల ఫింఛన్‌ను కూడా సమయానికి ఇవ్వడం లేదని అన్నారు. రైతుబంధు, పింఛన్, రుణమాఫీ, కరెంట్, ఉద్యోగాలు, వడ్లకు బోనస్.. అన్ని హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని.. కాంగ్రెస్ 420 హామీలపై గ్రామాల్లో, తండాల్లో చర్చకు పెట్టండని సూచించారు. దళిత బంధుకు మంజూరైన నిధులను కాంగ్రెస్ బ్యాంకుల్లో ఫ్రీజ్ చేసిందన్నారు. .

# కాంగ్రెస్ సర్కార్‌ను కూల్చే దమ్ముందా?

-మొదటి పేజి తరువాయి

రోడ్ల కోసం నిధులు మేము ఇచ్చే పరిస్తితి ఎందుకు వచ్చింది. చెరుకు పంటలో అడవి పందులు ఏ విధంగా దాడి చేస్తాయో అదే విధంగా తెలంగాణ పై కేసీఆర్ కుటుంబం దాడి చేసి విధ్వంసం చేశారు. అందిన కాడికి దోచుకుని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి డబ్బులు లేకుండా చేశారని ఆరోపించారు. రూ. 7 లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా కేసీఆర్ కుటుంబం మిగిల్చిందన్నారు సీఎం రేవంత్. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం విధ్వంసం చేసిందని వ్యాఖ్యానించారు సీఎం రేవంత్ రెడ్డి. మిషన్ భగీరథ పేరుతో రూ. 40 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. రూ. 7 లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా మార్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిధులు లేకుండా చేశారని ఆరోపించారు. దోపిడి పాలన కారణంగా, పదేళ్ల దుర్మార్గ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని అన్నారు సీఎం రేవంత్. తెలంగాణ ఏమైనా కేసీఆర్ కుటుంబం కోసం వచ్చిందా? అని వ్యాఖ్యానించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ సర్కార్ అడవి బిడ్డలను పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు మాత్రం మొండిచేయి చూపిన కేసీఆర్.. తన బిడ్డ కవితను ప్రజలు ఓడించినా ఎమ్మెల్సీతో ఉద్యోగం ఇచ్చారంటూ తీవ్ర విమర్శలు చేశారు సీఎం రేవంత్. .. ఎంత సేపు నీ బిడ్డలు నీ ఫామ్ హౌజ్ లు తప్ప.. రాష్ట్రంలోని బిడ్డల కోసం ఆలోచించావా?. కవిత ఓడిపోతే వెంటనే ఎమ్మెల్సీ ఉద్యోగం ఇచ్చావు. మరి స్టాఫ్ నర్సులు కానిస్టేబుల్స్ ఉద్యోగాలు ఇచ్చావా? అంటూ కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. బిల్లా రంగాలు(కేటీఆర్, హరీష్‌రావులను ఉద్దేశిస్తూ..) ఎంత శాప నార్థాలు పెట్టినా 15 రోజుల్లో 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేసే బాధ్యత మాదే అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

### ఎవడ్రా కూల్చేది?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా కాలేదు. అప్పుడే శాప నార్థాలు పెడుతున్నారు. మరి 10 ఏళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు మీరు?. ప్రభుత్వం కూలి పోతుంది అని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే దమ్ముందా?. ఎవడ్రా కూల్చేది?. ప్రజల్లారా.. మీరు ఊరుకుంటారా?. చెట్లకు కట్టేసి భరతం పట్టండి. కేసీఆర్ పాపాల భైరవుడు. మళ్లీ జీవితంలో సీఎం కారు. మూడు నెలలకో, ఆరు నెలలో కేసీఆర్ మళ్లీ సీఎం అవుతాడని ఎవరైనా అంటే పళ్లు రాలగొడతాం.

.. ఆరేడు ఎంపీ సీట్లు వస్తాయని కేసీఆర్ అంటున్నారు. వస్తే మోదీకి అమ్ముకుందాం అనా?. దేశంలో ఉన్నవి రెండే కూటములు. ఒకటి మోదీ కూటమి.. రెండోది ఇండియా కూటమి. కేసీఆర్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఇండియా కూటమిలోకి రానివ్వం. ఆ ఇంటి పిట్టను ఈ ఇంటి మీద వాలితే కాల్చి పారేస్తాం. మోదీ కేడీ(కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ..) ఇద్దరూ కలిసి కాంగ్రెస్ ను అడ్డుకోవాలని చూస్తున్నారు. మళ్లీ మతం పేరుతో వాళ్లు ఎన్నికలకు వస్తున్నారు. మోదీ ఎవరి ఖాతాలో అయినా రూ.15 లక్షలు జమ చేశారా? సోయంబాపురావుకు కనీసం కేంద్ర మంత్రి కూడా ఇవ్వలేకపోయారు. అలాంటప్పుడు ఓటేందుకు వేయాలి?. రాహుల్ ప్రధాని కావాలంటే ఆదిలాబాద్ లో కాంగ్రెస్ జెండా ఎగురాలి. త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ ఎవరి చేతుల్లో భద్రంగా ఉంటుందో ఆలోచించాలి" అని ప్రజల్ని కోరారాయన.

### కడెం మరమ్మత్తుల బాధ్యత మాది

కోటి ఎకరాలకు నీళ్లు అన్నావ్? వస్తావా కేసీఆర్ ఆదిలాబాద్‌ను చూపిస్తాం. హెలికాప్టర్ పెడతాం.. ఎక్కడ నీళ్లు ఇచ్చావో చూపించు అని కేసీఆర్‌పై రేవంత్ ధ్వజమెత్తారు. ఇక.. తెలంగాణలో మహిళలకు రూ. 500 కు సిలిండర్ గ్యాస్ అందించే పథకం త్వరలోనే అమలు



చేస్తామని.. 200 యూనిట్ల ఉచిత కరెంట్ త్వరలోనే అమలు చేస్తామని రేవంత్ అన్నారు. "తుమ్మిడి హిట్టి వద్ద ప్రాజెక్టు పూర్తి చేస్తాం. కడెం ప్రాజెక్టు మరమ్మతులు చేసే బాధ్యత మాది" అని రేవంత్ ప్రకటించారు.

త్వరలోనే ఆ రెండు హామీలు

### త్వరలోనే రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్..

త్వరలోనే రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ కూడా త్వరలో అమలు చేస్తామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు సీఎం. శుక్రవారం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన అక్కడ ఏర్పాటు చేసిన దర్బార్ కార్యక్రమంలో మాట్లాడరు. ఈ సందర్భంగా.. అతిత్వరలోనే రూ.500కి గ్యాస్ సిలిండర్ అందిస్తామని, అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ స్కీమ్ అమలు చేస్తామని ప్రకటించారు. మరికాసేపట్లో ఇంద్రవెల్లి అమరుల స్థూపానికి గౌరవ వందనం సమర్పించి.. అక్కడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ నుంచి ఆయన ప్రసంగిస్తారు.

### 15 రోజుల్లో 15వేల కానిస్టేబుళ్ల ఉద్యోగాలు..

రాబోయే 15 రోజుల్లో 15వేల కానిస్టేబుళ్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వాళ్లకు ఉద్యోగాలు ఇచ్చేందుకు కోర్టు కేసులు పరిష్కరిస్తారం అయ్యేలా పని చేస్తున్నామని చెప్పారు. వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 15వేల కానిస్టేబుళ్ల ఉద్యోగాలను కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు భర్తీ చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే 7వేల మంది స్టాఫ్ నర్సులకు ఉద్యోగాలిచ్చామని చెప్పారు సీఎం రేవంత్.

### ఆనాడే క్షమాపణలు చెప్పాను..

రాంజీగోండ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకున్నానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటామని ప్రకటించారు సీఎం. ఆదివాసీ ప్రాంతాన్ని అభివృద్ధివైపు నడిపించే బాధ్యత తీసుకుంటామన్నారు. 1981 ఇంద్రవెల్లి దారుణంపై ఆనాడే క్షమాపణ చెప్పానని, ఆనాడు సీమాంధ్ర పాలకుల పాలనలో ఆ తప్పు జరిగిందన్నారు రేవంత్ రెడ్డి. అమరవీరుల స్తూపం సాక్షిగా కేసీఆర్ పాలనను అంతం చేశామని, కేసీఆర్ కుటుంబం కోసమే రాష్ట్రం వచ్చిందా? అని ప్రశ్నించారు సీఎం రేవంత్‌రెడ్డి.

### కేసీఆర్ ఆదివాసీల గురించి ఆలోచించారా?

ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పౌరుషం గురించి చెప్పాలంటే కొమురంభీం పేరును ప్రస్తావించాల్సిందే అన్నారు. ఆదిలాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను మేం తీసుకుంటామని నాడే చెప్పామని... ఇప్పుడు ఆ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటామన్నారు. సమైక్య పాలనలో జరిగిన ఇంద్రవెల్లి ఘటనపై తాను క్షమాపణలు చెప్పానని గుర్తు చేశారు. నాడు అమరులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు అందిస్తున్నట్లు చెప్పారు. కానీ ఆదివాసీల గురించి కేసీఆర్ ఏనాడైనా ఆలోచించారా? కేబినెట్ సమావేశంలో చర్చించారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం కోసం తెలంగాణ వచ్చిందా? లేక గిరిజన, బలహీనవర్గాల కోసం వచ్చిందా? అని నిలదీశారు. చెరుకు తోటల్లో అడవి పందులు ఎలాగైతే విధ్వంసం చేస్తాయో... కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణలో అలాగే విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. 7 లక్షల కోట్ల రూపాయలు అప్పు తెచ్చి... తెలంగాణపై భారీ భారం మోపారన్నారు. అడవి బిడ్డలకు మంచినీరు ఇచ్చారా? అని ప్రశ్నించారు. కానీ మల్లు భట్టి విక్రమార్క ఇటీవలే మంచినీటి కోసం నిధులు ఇచ్చారని చెప్పారు. నిజంగానే కేసీఆర్ అభివృద్ధి చేస్తే మేం నిధులు ఇవ్వాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని నేను ఆ సన్నాసిని అడుగుతున్నానని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తరగతి గదుల కోసం కూడా నిధులు మేమే ఇచ్చామన్నారు.

### ఎంతసేపూ నీ బిడ్డలేనా?

ఎంతసేపూ నీ బిడ్డలు... నీ ఫామ్ హౌస్... ఆలోచన తప్ప తెలంగాణ సమాజం గురించి ఆలోచించలేదన్నారు. స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు కూడా మేమే ఇచ్చామన్నారు. నిజామాబాద్ లోక్ సభ ఎన్నికల్లో కవితను ఓడిస్తే వెంటనే ఎమ్మెల్సీ ఇచ్చావు... అల్లుడికి, కొడుకుకు మంత్రి పదవులు ఇచ్చావు... కానీ యువతకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బిల్లా రంగాలు తమకు ఎన్ని శాపనార్థాలు పెట్టినా... 15 రోజుల్లో 15వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసే బాధ్యతను మా మంత్రివర్గం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఎవరి చేతులో భద్రంగా ఉంటుందో ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. మేం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా కాలేదని... అప్పుడే ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని సన్నాసులు విమర్శలు చేస్తున్నారని భగ్గుమన్నారు. పేదవాడికి 200 యూనిట్ల విద్యుత్ ఇవ్వాలనే ఆలోచన మీకు ఎప్పుడైనా వచ్చిందా? అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. మహిళకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలనే ఆలోచన వచ్చిందా? అని నిలదీశారు. గద్దర్ ప్రగతి భవన్‌కు వస్తే ఆయనను ఎండలో నిలబెట్టారని మండిపడ్డారు. అందుకే తెలంగాణ ప్రజలు ఓడించి మీకు బుద్ధి చెప్పారన్నారు. తాము అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి... ఈ ప్రాంతాన్ని సాగునీటి రంగంలో అభివృద్ధి చేస్తామన్నారు. ఆ సన్నాసి కోటి ఎకరాలకు నీరు ఇచ్చినట్లు చెప్పారని... కానీ తాను హెలికాప్టర్ నుంచి చూస్తే ఎడారిలా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఇంకా బావులతోనే వ్యవసాయం చేస్తున్నారని... మనం సాగునీటిని ఇవ్వాలని కొండా సురేఖ చెప్పారన్నారు. కేసీఆర్ లక్ష కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడ్డాడు తప్ప చేసిందేమీ లేదన్నారు.

### నిత్యానందస్వామిలా వెళ్లి రాజునని ప్రకటించుకోవాలని ఎద్దేవా

నిత్యానందస్వామిలా కేసీఆర్ తన అక్రమాస్తులతో ఎక్కడో దీవికి వెళ్లి దానికి రాజుగా ప్రకటించుకోవాలి లేదా ఫామ్ హౌస్‌కు రాజుగా ప్రకటించుకోవాలని ఎద్దేవా చేశారు. కానీ మళ్లీ తెలంగాణకు సీఎం అయ్యేది లేదన్నారు. ఆయన పాపాల భైరవుడు అని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజలను మొత్తం కేసీఆర్ నిలువు దోపిడీ చేశాడని... అలాంటి వ్యక్తి మళ్లీ పదవి కావాలని అడగడానికి సిగ్గుండాలన్నారు. ఆరు నుంచి 8 పార్లమెంట్ స్థానాలు బీఆర్ఎస్ గెలుస్తుందని కేసీఆర్ చెబుతున్నారని... అంటే వాటిని మోదీకి అమ్ముకోవడానికా? అని ఆరోపించారు. ఇక్కడ ఎంపీలను గెలిచి... మోదీకి అమ్ముకోవడానికి మిమ్మల్ని గెలిపించాలా? అన్నారు.

## కాంగ్రెస్ గెలవలేదు..

-మొదటి పేజి తరువాయి

ఉన్నా, కాంగ్రెస్ ఉన్నా ఉపయోగం లేదని చెప్పారు. కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని... లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకే ఓటు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు.



### హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ఫెయిల్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువతను మరోసారి మోసం చేసిందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా కాంగ్రెస్ హామీలు నెరవేర్చడంలో ఫెయిల్ అయిందంటూ ట్వీట్ చేశారు. ప్రజలను మభ్యపెట్టడంలో కాంగ్రెస్‌కు ఘన చరిత్ర ఉందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్నిరోజుల ముందు... 25 నవంబర్ 2023 రోజున కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున వార్తా పత్రికలలో ప్రకటన ఇచ్చిందని... 1 ఫిబ్రవరి 2024 నాటికి గ్రూప్ 1 నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ఈ రోజు ఫిబ్రవరి 2వ తేదీ అని గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీలు, ఇచ్చిన మిగతా హామీలను తాము తప్పకుండా అమలు చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పిందని... కానీ ఇప్పుడు హామీల దిశగా ఎలాంటి ఆలోచన చేయడం లేదని విమర్శించారు. ఫిబ్రవరి నెల వచ్చినప్పటికీ నోటిఫికేషన్ రాలేదన్నారు. నమ్మి ఓటు వేసిన యువతను కాంగ్రెస్ నిండా ముంచిందని ఆరోపించారు. ఇతర హామీలను కూడా దాటవేసే ప్రయత్నం చేస్తోందన్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నాణ్యతకన్నా.. కమీషన్లపైనే దృష్టి పెట్టింది

**స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ తన కలల ప్రాజెక్టు**

**నల్గొండ:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నాణ్యతకన్నా కమీషన్లపైనే దృష్టిపెట్టిందని ఆర్ అండ్ బీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు జిల్లాలో స్కిల్ డెవలప్ సెంటర్ ఏర్పాటుకు శనివారం నాడు శంకుస్థాపన చేశారు. ఒకేరోజు రూ. 134.5 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ తన కలల ప్రాజెక్టు అని తెలిపారు. తనను గుండెల్లో పెట్టుకున్న నల్గొండ యువత రుణం తీర్చుకోవడానికి ఈ అవకాశం దొరికిందని హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు కట్టడం పూర్తికాకముందే కూలిపోతున్నాయని ఆరోపించారు. ప్రజాధనాన్ని వృథా చేసిన ఆ పార్టీ నాయకులు తమకు నీతులు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు.



## పోలీసుల వ్యూహాలకు ప్రతివ్యూహాలు..

-మొదటి పేజి తరువాయి

మావోయిస్టులు ఉన్నారు. ఈ మేరకు 80 పేజీలతో కూడిన ప్రత్యేక డాక్యుమెంట్‌ను గోండు భాషలో తయారు చేశారు. ఇందులో ఉన్న రణతంత్ర వివరాలపై గతంలోనే జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే, దీనిని ఆతర్వాత కొందరు హిందీలోకి అనువదించినట్టు తెలిసింది.

### ఆకాశదాడులు తిప్పికొట్టేలా..

డ్రోన్లు, హెలికాప్టర్లతో భద్రతాదళాలు తమపై రెండేళ్లుగా దాడులు చేస్తున్నాయంటూ మావోయిస్టులు ఆరోపిస్తుండగా, మావోయిస్టుల ఏరివేతకు వాయు దాడులు చేయడం లేదని భద్రతాదళాలు చెబుతున్నాయి. డ్రోన్లు ఉపయోగించినా నిఘా కోసమే తప్ప దాడులకు కాదంటున్నారు. ఇలా భిన్నవాదనలు ఉన్నా, ఆకాశ దాడులను తట్టుకోవడంతో పాటు తిప్పికొట్టే వ్యూహాలపై మావోయిస్టులు తీవ్రంగా ఆలోచించారు. ఈమేరకు రక్షణ వ్యూహాల్లో డ్రోన్లు, హెలికాప్టర్ల దాడుల నుంచి తప్పించుకునే అంశంపై డాక్యుమెంట్‌లో చర్చించారు. తాము సంచరిస్తున్న ప్రాంతాల్లో డ్రోన్లు లేదా హెలికాప్టర్లు ఎదురైతే వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని నిర్ణయించారు. డ్రోన్లు, హెలికాప్టర్ దాడులను తిప్పికొట్టేలా 'చెట్లపై నుంచి రాకెట్ లాంచర్లు పేల్చడం'పై కేడర్‌కు శిక్షణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. డ్రోన్లపై తేలికగా దాడులు చేసేందుకు వీలుగా కొండపై ఎత్తయిన ప్రాంతాల్లో గస్తీ బృందాలు ఏర్పాటు చేయడం, అక్కడి నుంచే లాంగ్ పైప్ బాంబులను ప్రయోగించే దానిపై ఫోకస్ చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

### మూడడుగుల బంకర్లు

డ్రోన్లు, హెలికాప్టర్ల కంట పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా డాక్యుమెంట్‌లో చర్చించారు. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు అడవిలో ఆరుబయట ప్రాంతంలో కాకుండా పైనుంచి చూస్తే కనిపించకుండా ఉండే చెట్ల కిందే విశ్రమించాలని నిర్ణయించారు. ఒకే చోట ఎక్కువ కాలం ఉంటే...కనీసం మూడు అడుగుల లోతుతో బంకర్లు నిర్మించాలని డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు.


### కొత్తగా మావోయిస్టు స్నైపర్ టీమ్‌లు

మావోయిస్టులకు ఇప్పటికే బెటాలియన్లు, ప్లాటూన్లు, లోకల్ గెరిల్లా స్క్వాడ్, యాక్షన్స్ టీమ్‌లు ఉన్నాయి. అయితే అబూజ్‌మడ్ అడవుల్లో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ క్యాంపులు పెరిగిపోతున్నాయి. ఒకేసారి వందల మందితో కూడిన బెటాలియన్లు అడవుల్లో నలుదిశలా కూంబింగ్ చేస్తున్నాయి. దీంతో భద్రతాదళాలపై అందుబాటులో ఉన్న కేడర్‌తో అంబూష్ దాడి చేయడం మావోయిస్టులకు సాధ్యం కావడం లేదు. కనీసం కూంబింగ్ స్పీడ్‌కు బ్రేకులు వేయడం సైతం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్తగా స్నైపర్ టీమ్‌లు ఏర్పాటు చేసే అంశంపై మావోయిస్టులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. అడవుల్లోకి వచ్చే భద్రతాదళాలపై స్నైపర్ టీమ్ దాడి చేసి కనీసం ఒక్కరిని గాయపరచగలిగినా భద్రతా దళాల ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని, తద్వారా కూంబింగ్ స్పీడ్‌కు బ్రేకులు పడతాయనేది మావోయిస్టుల వ్యూహంగా ఉన్నట్టు తెలిసింది.

## తెలంగాణలోనూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్?

-మొదటి పేజి తరువాయి

స్పష్టత రాలేదు. వాస్తవానికి కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏ మేరకు నిధులు వస్తాయన్న అంచనాలతోనే రాష్ట్ర బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్ ఇన్‌ఎయిడ్‌తో పాటు పలు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు (సీఎస్ఎస్) నిధుల కేటాయింపులను అంచనా వేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాను పేర్కొంటూ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అయితే కేంద్రం పెట్టిన ఓటాన్ అకౌంట్‌లో ప్రజలపై విధించే ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానంలో ఎలాంటి మార్పు లేదని ప్రకటించారు కానీ, రాష్ట్రాలకు ఇచ్చే నిధుల విషయంలో విధాన నిర్ణయాన్ని ప్రకటించలేదు. దీంతో అసలు కేంద్రం నుంచి ఎన్ని నిధులు వస్తాయన్న దానిపై రాష్ట్ర ఆర్థిక శాఖ కూడా అంచనాకు వచ్చే అవకాశం లేదని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ వైపే మొగ్గు చూపుతుందని అంటున్నారు. గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా 2019-20 ఆర్థిక సంవత్సరంలోనూ కేంద్రం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టింది. తెలంగాణలో కూడా ఆరు నెలల కాలానికి గాను ఓటాన్ అకౌంట్ పెట్టి ఆ తర్వాత సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.



## కాంగ్రెస్ నాయకులను సన్మానించిన మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ సభకు వచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, కాంగ్రెస్ యువ నాయకులు ఆర్జుమన్ అలీని, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ నౌషాద్ పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

# ఎన్నికల వేళ తాయిలాల పద్దు!

ఈ సారి బడ్జెట్ వరాల జల్లు కురిపించదు.. తాయిలాలు మాత్రమే పంచుతుంది. ఎందుకంటే ఇది ఎన్నికల ముందు సమర్పించే బడ్జెట్. ప్రస్తుత కేంద్ర బడ్జెట్ 2024 మార్చి 31 వరకు అమలులో ఉంటుంది. అంటే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు.. ఇందులో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వానికి అయ్యే సాధారణ ఆదాయ వ్యయ అంచనాలు, అలాగే ఆర్థిక లోటు, ఆర్థిక పనితీరుతో ఈ మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించనున్నారు. అందుకే దీన్ని తాత్కాలిక బడ్జెట్‌గానే పరిగణించాలి. అందుకే ఇందులో కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో పెద్ద మార్పులు లేదా కొత్త దీర్ఘకాలిక ప్రాజెక్ట్‌లు ఉండే అవకాశం లేదు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొంది అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత కొత్త ప్రభుత్వ పూర్తిస్థాయి బడ్జెట్ జులైలో ఉంటుంది. ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేయడం సహజమే. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆర్థిక శాఖ నిర్మలా సీతారామన్ కేటాయింపులు పెంచుతూ మధ్యంతర బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసే అవకాశముందని తెలుస్తోంది. రైతులు, మహిళలు, బడుగు, బలహీన వర్గాలు, చిరు వ్యాపారులు ఆకట్టుకునేలా నిర్మలమ్మ మధ్యంతర బడ్జెట్ ఉండే అవకాశముంది. అలాగే దేశీయ ఆవిష్కరణలు, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా ప్రత్యేక రాయితీలను ప్రకటించే అవకాశముంది. ద్రవ్యోల్బణం పెరిగిన నేపథ్యంలో ఆదాయ పన్ను పరిమితిని పెంచి ఊరట కలిగించాలనే ప్రయత్నం చేయవచ్చు.

2019లో మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడంతో నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1970-71వ ఆర్థిక సంవత్సరానికి గాను ఇందిరాగాంధీ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించింది. ఇక ఆ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండవ మహిళా మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలిచారు. తన తొలి బడ్జెట్‌ను 2019లో ప్రవేశపెట్టారు. గతేడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆరవ ఆర్థికశాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలిచారు. బడ్జెట్ ప్రతులను ఒక సూట్‌కేసులో అప్పటి ఆర్థికశాఖ మంత్రులు సూట్‌కేసులో తీసుకొచ్చేవారు. కానీ రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చాక నిర్మలమ్మ ఈ సంప్రదాయానికి బ్రేక్ వేశారు. ఈ బడ్జెట్‌లో భారీ మార్పులు, పథకాలకు అవకాశం లేదు. కానీ ఇది కొత్త ప్రభుత్వం తీసుకురాబోయే పూర్తి బడ్జెట్‌కు ఓ సూచనగా నిలుస్తుంది. దీంతో ఆయా రంగాల నిపుణులు మధ్యంతర బడ్జెట్‌పై అంచనాలు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో మహిళా సాధికారతకు పద్దులో కేంద్రం పెట్టపీట వేస్తుందా, లేదా అని మహిళలు ఎదురు చూస్తున్నారు. ఆధునిక భారతీయ మహిళలు బడ్జెట్‌లో ఆశిస్తున్న మార్పులు ఏవో చూద్దాం. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇందిరాగాంధీ జాతీయ



వితంతు పింఛను పథకం, నిర్భయ ఫండ్, సక్షం అంగన్‌వాడీ, పోషణ్‌కు కేటాయింపులతో మహిళా సంక్షేమ పథకాలపై కేంద్రం దృష్టి సారించనుంది. గత దశాబ్దంలో మహిళలకు బడ్జెట్ కేటాయింపులు 30 శాతం పెరిగాయి. ఈ బడ్జెట్‌లో కూడా కేటాయింపులు పెంచాలని స్త్రీలు కోరుతున్నారు. నేరుగా నగదు బదిలీకి వీలు కల్పించే పథకాలను ఆశిస్తున్నారు. అదే విధంగా మహిళా రైతులకు పెట్టుబడి కోసం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని రూ.12,000 వరకు పెంచాలని కోరుతున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో మహిళలకు వడ్డీలేని రుణాలు అందించాలని భావిస్తున్నారు. అలానే 7.5 శాతం వడ్డీతో 2సంవత్సరాలకు 2 లక్షల వరకు పొదుపు చేసుకునేలా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ తీసుకురావాలని కోరుతున్నారు.

బడ్జెట్ అంటే కేవలం సంక్షేమ పథకాలే కాదు. ఇది ఆర్థిక వృద్ధిని పెంచడం, ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడంపై కూడా ఫోకస్ చేస్తుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో డిమాండ్‌ను పెంచేందుకు, మొత్తం ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోనుంది. రాబోయే ఎన్నికలు ఉన్నప్పటికీ, బడ్జెట్ ఆర్థిక క్రమశిక్షణపై దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బహుశా మధ్యంతర పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యంగా పెట్టుకుని అమలు చేయవచ్చు. ఆర్థిక వృద్ధిలో అంచనాల పెరుగుదలతో, మధ్యంతర బడ్జెట్ 2024-2025 ఆర్థిక సంవత్సరం కోసం అధిక ప్రత్యక్ష పన్ను వసూళ్లను అంచనా వేయవచ్చు. మొత్తం పన్ను వసూళ్లలో 12-13% వృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవచ్చు. 2023-2024 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 14% తక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. సమాజంలోని ఐదు కీలక వర్గాలను మోదీ సర్కార్ లక్ష్యంగా చేసుకుని తాయిలాలు ప్రకటించే యోచన చేస్తోంది మోదీ ప్రభుత్వం. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టే బడ్జెట్ కనుక ఐదు వర్గాలను లక్ష్యంగా చేసుకుని బడ్జెట్‌ను తయారు చేస్తున్నట్లు ఊహాగానాలు అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు మహిళలు, బీద బడుగు బలహీన వర్గాలు, యువత, రైతులు, గిరిజనులపై బడ్జెట్‌లో ఎక్కువగా దృష్టి సారించే దిశగా ఆర్థిక శాఖ కసరత్తు చేసింది. ఇప్పటికే పైన పొందుపర్చిన ఐదు వర్గాల వారికి ఇస్తున్న పథకాలలో మరిన్ని మేలు చేసే అంశాలను చేర్చడంతో పాటు ఇంకొన్ని కొత్త పథకాలను తీసుకొచ్చేలా మోదీ సర్కార్ ప్రణాళిక రూపొందించవచ్చు. విద్య నైపుణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు ఈ రంగలో వర్తించే పథకాల ద్వారా యువత కలలు, వారి అభివృద్ధి కోసం చేయబోయే కార్యక్రమాలను నొక్కి వివరిస్తున్నారు. ఇలానే మిగతా పథకాలపై కూడా దృష్టి సారించి మహిళలు, పేదలు, యువత, రైతులు, గిరిజనుల ఓటు బ్యాంకే లక్ష్యంగా బడ్జెట్‌ను రూప కల్పన చేసి మరో మారు కేంద్రంలో అధికారం చేపట్టడమే నిర్మలమ్మ లక్ష్యం.

# ఐరోపా రైతాంగం నిరసనలు

ఐరోపా యూనియన్ పార్లమెంటు ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. పార్టీలన్నీ సిద్ధం అవుతుండగా వివిధ దేశాల్లో రైతులు పోరుబాట పడుతున్నారు. నిన్న జర్మనీ, రుమేనియాలో, నేడు ఫ్రాన్సు, ఇతర దేశాల్లో రైతులు రోడ్డెక్కారు. అనేక దేశాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. అక్కడ రైతులు మన మాదిరిగా జెండాలు పట్టుకొని ప్రదర్శనలు చేయటానికి బదులు ట్రాక్టర్లు, ట్రక్కుల వంటి వాటితో వచ్చి ఎక్కడికక్కడ రోడ్ల మీద నిలిపివేసి నిరసన తెలుపుతున్నారు. అనేక యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. టిక్‌టాక్ వంటి వాటిలో నిరసన వీడియోలు నింపుతూ ప్రచారంలో పెడుతున్నారు. ఐరోపా సామాజిక మాధ్యమాల్లో ఆకర్షిస్తున్న పదాల జాబితాలో ''రైతులు'' కూడా చేరిందంటే సమస్యల తీవ్రతకు అద్దం పడుతున్నది. బ్రసెల్స్‌లో జరుగుతున్న ఐరోపా యూనియన్ సమావేశాల సందర్భంగా తమ నిరసన వెల్లడిస్తూ బెల్జియం, ఫ్రాన్స్, ఇటలీ తదితర దేశాల్లో రైతులు (జనవరి 31) బుధవారం నాడు ఆందోళనకు దిగారు. నౌకాశ్రయాలు, ఇతర ఆర్థిక కేంద్రాలలో లావాదేవీలను జరగకుండా చేశారు. అనేక చోట్ల ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ వాహనాలతో రోడ్లను దిగ్బంధనం చేశారు. బ్రసెల్స్ నగరంలో ప్రవేశించేందుకు రైతులు పెద్ద ఎత్తున నలుమూలల నుంచీ తరలి వస్తున్నట్లు వార్తలు వచ్చాయి. గురువారం నాడు నిరసన తెలపనున్నట్లు ప్రకటించారు. అనేక చోట్ల పౌర జీవనానికి కూడా ఆటంకం కలిగింది.

ఐరోపా యూనియన్ దేశాల్లో రుమేనియాలో అత్యధికంగా 35 లక్షల మంది రైతులు ఉన్నారు. జనవరి పది నుంచి వీరితో పాటు రవాణా రంగ కార్మికులు అనేక సందర్భాలలో కలిసే ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వానికి సమర్పించిన 47 డిమాండ్ల జాబితాలో డీజిల్ పన్ను తగ్గింపు, మోటారు వాహనాలపై పౌర సంబంధ బీమా ప్రీమియం తగ్గింపు వంటి అంశాలతో పాటు ఉక్రెయిన్ సంక్షోభం ముందుకు తెచ్చిన ప్రధాన అంశాలు ఉన్నాయి. ఐరోపా దేశాల్లో రవాణాకు పర్మిట్లు అవసరం, ఉక్రెయిన్ సంక్షోభం తరువాత వాటిని ఎత్తివేశారు. దాంతో రవాణా ఖర్చులు తక్కువగా ఉండే ఉక్రెయిన్ వాహనాల నుంచి వచ్చిన పోటీని రుమేనియా, ఇతర దేశాల ట్రక్కుల యజమానులు తట్టుకోలేకపోతున్నారు. అంతేకాదు, అక్కడి నుంచి చౌకగా దిగుమతి చేసుకుంటున్న ధాన్యం వంటి వ్యవసాయ ఉత్పత్తుల కారణంగా మిగతా దేశాల్లో ధరలు పడిపోయి రైతాంగానికి గిట్టుబాటు కావటం లేదు. రుమేనియా రాజధాని బుఖారెస్ట్‌లో నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని జనవరి పదిన అడ్డుకున్నారు. దాంతో ఇరవై కిలోమీటర్ల పొడవున రైతులు భైఠాయించారు. పది రోజుల తరువాత 21వ తేదీన అనుమతి ఇచ్చారు. అంతకు ముందు ఉక్రెయిన్‌తో రెండు చోట్ల సరిహద్దులను రైతులు దిగ్బంధించారు. మన దేశంలో నిరసన తెలిపిన వారిని రైతులు కాదని ఎలా నిందించారో రుమేనియాలో కూడా అదే జరిగింది. సాధారణ రైతులతో పాటు వ్యవసాయ రంగంతో సంబంధం ఉన్న చిన్న, మధ్య తరగతి వ్యాపారులు కూడా బాసటగా నిలిచారు. నాలుగు శాతం భూమిని సాగు చేయకుండా వదలి వేయాలని, పంటల మార్పిడి పద్ధతిని విధిగా పాటించాలని, రసాయన ఎరువుల వాడకాన్ని ఇరవై శాతం తగ్గించాలనే నిబంధనలను ఐరోపా యూనియన్ అమలు చేయనుంది. దీని వలన ప్రపంచంలో ఇతర రైతులతో చౌకగా వచ్చే దిగుమతులతో తాము పోటీ పడలేమని స్థానిక రైతులు చెబుతున్నారు. దీనికి తోడు ద్రవ్యోల్బణం కారణంగా తమకు నేరుగా ఇచ్చే నగదు విలువ కూడా తగ్గుతున్నదని ఆందోళన వెల్లడిస్తున్నారు. ఉక్రెయిన్ సంక్షోభం ఐరోపా అంతటా రైతాంగాన్ని ప్రభావితం చేయటంతో వారు వీధుల్లోకి వస్తున్నారు. ఉక్రెయిన్‌లో సగటు కమతా విస్తీర్ణం వెయ్యి హెక్టార్లు కాగా, ఐరోపా ఇతర దేశాల సగటు కేవలం 41 హెక్టార్లు మాత్రమే. అందువలన గిట్టుబాటులో కూడా తేడా ఉంటున్నది. ఉక్రెయిన్ దిగుమతులను నిరసిస్తూ పోలాండ్ రైతులు జనవరి 24న దేశవ్యాపితంగా ఆందోళన చేశారు. ఉక్రెయిన్ ధాన్యాన్ని ఆఫ్రికా, ఆసియా మార్కెట్లకు పంపాలి తప్ప ఐరోపా దేశాలకు కాదని పోలాండ్ రైతు సంఘ ప్రతినిధి చెప్పాడు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఇప్పటి వరకు స్పెయిన్, ఇటలీ, పోర్చుగీసు రైతులు ప్రభావితం కాలేదని, అయితే పర్యావరణ రక్షణ చర్యలు వారిని కూడా వీధుల్లోకి తీసుకురానున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. స్పెయిన్, పోర్చుగీసులో కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి కారణంగా వ్యవసాయానికి వాడే నీటి పరిమాణం మీద ప్రభుత్వాలు ఆంక్షలు విధించాయి. జరిగిన నష్టాలకు తమకు పరిహారం ఇవ్వటం లేదని రైతులు విమర్శించారు. ఒక్కో చోట ఒక్కో సమస్య ముందుకు వస్తుండటంతో గత కొన్ని సంవత్సరాలుగా వివిధ ఐరోపా దేశాల్లో రైతులు రోడ్లెక్కటం ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగమంటూ నత్రజని వాయువు విడుదలను పరిమితం చేసేందుకు పూనుకోవటంతో 2019లో నెదర్లాండ్ అంతటా రైతులు రోడ్లను దిగ్బంధించారు. గతేడాది డిసెంబరులో కూడా నిరసన తెలిపారు. ఉక్రెయిన్ డ్రైవర్లకు పర్మిట్ పద్ధతి అమలు జరపాలని కోరుతూ పోలాండ్ ట్రక్కరు సరిహద్దులను మూసివేసి అడ్డుకున్నారు. ఉక్రెయిన్ నుంచి వస్తున్న చౌక దిగుమతులను అడ్డుకోవాలని రైతులు జనవరి ప్రారంభంలో వీధుల్లో ప్రదర్శనలు చేశారు. వ్యవసాయ సబ్సిడీల కోత ప్రతిపాదనలకు నిరసనగా వేలాది మంది జర్మన్ రైతులు బెర్లిన్‌ను దిగ్బంధం చేశారు. తాజాగా ఫ్రాన్సులో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు, కొన్ని చోట్ల హింసారూపం తీసుకుంది. వివిధ దేశాల నుంచి చౌకగా దిగుమతులు చేసుకుంటూ తమ పొట్టగొడుతున్నారని ఆగ్రహించిన ఫ్రెంచి రైతులు తమ దేశం గుండా స్పెయిన్ నుంచి మొరాకో వెళుతున్న వైన్, కూరగాయల రవాణా ట్రక్కులను అడ్డుకొని ధ్వంసం చేశారు.

# వృద్ధుల పాలిట శాపంగా కీళ్ళ వాత సమస్యలు

1858లో ఆల్ఫ్రెడ్ బి. గర్రోడ్ నామకరణం చేలిన "రుమటాయిడ్ ఆర్థరైటిస్" వ్యాధి నేడు ప్రపంచ దేశాల వృద్ధులను పట్టి పీడుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కీళ్ళవాత సమస్యలు దీర్ఘకాలం పాటు వృద్ధులను వేధిస్తునే ఉన్నాయి. క్రోనిక్ ఆటోఇమ్యూన్ వ్యాధిగా పేరొందిన రుమటాయిడ్ ఆర్థరైటిస్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి 2013 నుంచి 'రుమటాయిడ్ పేషంట్స్ ఫౌండేషన్' చొరవతో ప్రపంచ దేశాలు 02 ఫిబ్రవరిన "రుమటాయిడ్ ఆర్థరైటిస్ అవగాహన దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. కీళ్ళవాత సమస్యలను త్వరగా నిర్ధారించుకోవడం, సమర్థవంత నిర్వహణ, దీర్ఘకాలిక వైద్యం లాంటి అంశాలను ప్రజలకు అవగాహన పరచడానికి ఆ వేదిక ఉపయోగపడుతున్నది. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉన్న వయోవృద్ధులు కీళ్ళ నొప్పుల సమస్యలతో ఏమీ చేయలేక జీవితాలను, సమయాన్ని వృధా చేసుకుంటున్నారు. మానసికంగా శారీరకంగా బలహీనపరుస్తున్న కీళ్ళవాత సమస్యలు రానున్న భవిష్యత్తులో వయోజనులకు పెద్ద అవరోధంగా నిలుస్తూ ఉండనుంది.

జెనెటిక్స్, పర్యావరణం, హార్మోన్లు లాంటివి కీళ్ళ వాత రోగానికి కారణం అవుతున్నాయి. కీళ్ళవాత వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే గుండె, ఊపిరితిత్తులు, నాడీ మండల సమస్యలకు కూడా దారి తీస్తాయని గమనించాలి. 02 ఫిబ్రవరి 2024న నిర్వహించుకుంటున్న 'రుమటాయిడ్ ఆర్థరైటిస్ దినం - 2024' నినాదంగా లివింగ్ వెల్ విత్ ఆర్ఏ : ఎర్లీ డయగ్నొసిస్, ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్, అండ్ ఏ బ్రైట్ ఫ్యూచర్" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. తొలి దశలో గుర్తించడంతో సమస్య పరిష్కారం సులభంగా దొరుకుతుంది. కీళ్ళవాత సమస్యలను గుర్తించిన వెంటనే వైద్య సలహాలు తీసుకుంటూ చికిత్సకు సహకరించాలి. కీళ్ళవాత వ్యాధి కట్టడికి ఆరోగ్యకర జీవనశైలి, వైద్యుల సూచనలు పాటించడం, కీళ్ళవాత రోగుల నుంచి అనుభవాలను రాబట్టుకోవడం లాంటివి ఆచరించాలి. కీళ్ళవాత వ్యాధికి ఆధునిక చికిత్సలు కూడా అందుబాటులోకి రావడంతో



ఆధునిక వైద్య విధానాల సహాయంతో నయం కావడం సులభం అవుతున్నది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధి కారణంగా కీళ్ళ వాపులు, నొప్పులు, కీళ్ళ దృఢత్వం, అలసట, జ్వర, ఆకలి లేమి, కండరాల బలహీనతలు, కీళ్ళ వైకల్యం లాంటి లక్షణాలతో కదలడంలో ఇబ్బందులు, అంగ వైకల్య భావనలు, కీళ్ళ విధ్వంసాలు, కణజాల విధ్వంసాలు కూడా కలుగుతాయి. అసాధారణ వ్యాధినిరోధక స్పందనల కారణాలతో కీళ్ళ వాతం సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

కీళ్ళ వాత వ్యాధి నిర్ధారణకు రోగి మెడికల్ హిస్టరీ, భౌతిక పరీక్షలు, రక్త పరీక్షలు, ఎక్స్-రే, ఎంఆర్ఐ లాంటి పరీక్షలు నిర్వహిస్తారు. కీళ్ళవాత వాపులు, నొప్పులు, కీళ్ళ విధ్యంసాన్ని అదుపు చేసుకోవడం లాంటి వైద్య చర్యలు పాటించాలి. తొలి దశలో రోగ లక్షణాలను గమనిస్తూ వైద్య సలహాలు తీసుకుంటూ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగితే కీళ్ళవాత రోగానికి పరిష్కారం దొరుకుతుంది. కీళ్ళవాత వ్యాధి సాధారణ ప్రజలకు పట్ల అవగాహన, రోగులకు అవగాహన కల్పించడం, త్వరగా వ్యాధి నిర్ధారణ చేసుకోవడం, కీళ్ళవాత సంబంధ చికిత్సలకు సంబంధించిన నిధులు కేటాయించడం నిరంతరం జరగాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు, చేపలు, ఆరోగ్యకర ఓమెగా-3తోనకూడిన కొవ్వులు లాంటివి తీసుకుంటూనే స్వల్ప వ్యాయామం/నడక/ఈత/బైకింగ్, బరువు తగ్గే విధంగా లావు తగ్గడం, విశ్రాంతి తీసుకోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని కట్టడి చేసుకోవడం లాంటివి పాటించాలి. ఈ విషయాలన్నింటినీ గమనిస్తూ కీళ్ళవాత సమస్యలను శాశ్వతంగా పొలిమేరలు దాటిద్దాం, ఆరోగ్యకర వృద్ధుల ప్రేమలను ఆస్వాదిద్దాం.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**వాస్తవ నేస్తం,కూకట్‌పల్లి:** 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ నుండి పీజేఆర్ నగర్ కు వెళ్లే సీసీ రోడ్డు కొరకు గతంలో యాభై లక్షల రూపాయల నిధులు మంజూరై, ఇప్పుడు పెండింగ్ నిర్మాణ పనులు జరుగుతున్న సీసీ రోడ్డును డివిజన్ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా సిసి రోడ్ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సి.ఎచ్ భాస్కర్, ఖాజా, వెంకటేష్ గౌడ్, ఇంతియాజ్, పోశెట్టిగౌడ్, మహేష్, కటికరవి, మహబూబ్, సాయిగౌడ్, వర్క్ ఇస్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్టు పనులను పరిశీలించిన ఆరెకపూడి గాంధీ



**వాస్తవ నేస్తం,కూకట్‌పల్లి:** వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎనక్లేవ్ వద్ద రూ.90 తొంబై లక్షల రూపాయల అంచనావ్యయం తో చేపడుతున్న వడ్డేపల్లి ఎనక్లేవ్ నుండి మాధవరం నగర్ కాలనీ హై టెన్షన్ లైన్ కింద నాల మీద నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు, కార్పొరేటర్ రోజాదేవి రంగరావు తో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడకుండా పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చేస్తున్నామన్నారు. అదేవిధంగా రాబోయే వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజా అవసరాల దృష్ట్యా నాలాపై కల్వర్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నాలాలో పేరుకుపోయిన మట్టిని వెంటనే తొలగించాలని, కల్వర్టు నిర్మాణ పనులపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**వాస్తవ నేస్తం,అనంతగిరి:** కొండ పైనున్న అయ్యప్ప స్వామి దేవాలయానికి వెళ్లడానికి సిసి రోడ్డు పనులను, అనంతగిరి నుంచి అనురాగ్ కాలేజీ వరకు స్ట్రీట్ సెంట్రల్ లైటింగ్ లను ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే సమక్షంలో సర్పంచ్ వేనేపల్లి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు, 100 మంది కుటుంబాలు టిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు వేనేపల్లి చందర్రావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, కొండపల్లి వాసు ఎంపీపీ చందూరు వెంకటేశ్వరరావు, జడ్పిటిసి కొనతం ఉమా శ్రీనివాసరెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, నరసింహారెడ్డి, ప్రమోద్ రెడ్డి, బాబు నాయక్, వెంకటరెడ్డి, దేగ కొండయ్య తదితరులు ఉన్నారు.

## పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కి సన్మానం



**వాస్తవ నేస్తం,నిర్మల్:** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన చలో ఇంద్రవెల్లి కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ను కలిసిన నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు మర్యాదపూర్వకంగా శాలువాతు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం పీవీ రమణ రెడ్డి, మామడ మండల మాజీ జెడ్పిటీసీ రఫీ, కొట్టే శేకర్, జీవన్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగం ఫలితమే రిజర్వేషన్ అమలు: జావ్వాజి నాగరాజు

**వాస్తవ నేస్తం,వైరా:** మండలంలోని తాటిపూడి గ్రామంలో గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మాజీ పంచాయతీ పాలకవర్గ సభ్యులను కొంతమందిని మరియు ప్రత్యేక అధికారి పవన్ ను హెల్త్ సిబ్బందిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నా యువజన కాంగ్రెస్ నాయకులు జావ్వాజి నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచినా అతి పెద్ద రాజ్యాంగం మన భారత రాజ్యాంగం అని, ఆ రాజ్యాంగం ప్రతిఫలమే నేడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులనుగా ఎన్నుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాజీ వార్డు సభ్యులకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పవన్,కొష్టాల మాజీ సర్పంచ్ జయరాజు ,తాతా నిర్మల,పలువురు వార్డు సభ్యులు మరియు జావా వెంకటేశ్వర్లు ,జవాజి కృష్ణయ్య, పెద్ద ఎంకులు ,పాపగంటి వెంకటేశ్వర్లు, పగిడిపల్లి బాబురావు ,ఏపూరి శ్రీనివాసరావు ,నారపోగు సైదులు,



పిడాయల వినోద్ ,చంద్రయ్య, పీడియాల కృష్ణ ,చిత్తూరు కృష్ణ ,బండి సత్యం, నాగయ్య, రాంబాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ బోనకల్ ను ప్రత్యేక ప్రత్యేక గ్రామపంచాయతీ గా ఏర్పాటు చేయాలి

**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిధిలోని రావినూతల గ్రామపంచాయతీ పరిధిలోని 11,12 వార్డు, బోనకల్ మండల కేంద్రంలోని బోనకల్ గ్రామపంచాయతీ 11,12 వార్డులలో నివసిస్తున్న వారు తమ ప్రాంతాన్ని ఆయా గ్రామ పంచాయతీల నుండి విడదీసి స్టేషన్ బోనకల్ గా నామకరణం చేసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని శుక్రవారం ఖమ్మం జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇక్కడ నివసిస్తున్న ప్రజలు ఆయా పంచాయతీకి రెండు కిలోమీటర్ల దూరం ఉండటం వలన రేషన్ బియ్యం,పంచాయతీ కార్యాలయంలో ని పనులకు వెళ్లవలసి వచ్చినప్పుడు పలు ఇబ్బందులు పడుతున్నామని, సంక్షేమ పథకాలలో అభివృద్ధిలో కూడా ఇక్కడ వారికి అన్యాయం జరుగుతుందని,అందువలన తమ ప్రాంతాన్ని ప్రత్యేక పంచాయతీగా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబాల, కరుణాకర్ జిల్లా నాయకులు పాలడుగు కృష్ణ ప్రసాద్ తెలుగు యువత కార్యదర్శి మైనేని రవికుమార్, టీఆరెస్ నాయకులు గంగూరి రాఘవరావు,కాంగ్రెస్ నాయకులు పర్సనబోయిన వీరభద్రం ,సిపిఎం నాయకులు మచ్చ గురువయ్య,స్థానికులు కోలా వెంకటేశ్వర్లు,(కొండ) రాయపూడి శ్రీనివాసరావు, మండూరి వెంకన్న, అంబటి సంపత్ కుమార్, జిడుగు శ్రీనివాసరావు బొమ్మ కంటి కొండలు,బొమ్మకంటి నరసింహ రావు, తాటి వీరభద్రం ఎండి నవీద్ భాష ,నున్న సైదులు తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసుల ప్రాంతాన్ని అభివృద్ధి బంగారు బాట పట్టిస్తాం

### రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి





**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ఆదివాసులు, గిరిజనుల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆధునిక ప్రపంచానికి చేరువగా అభివృద్ధి బాటలు వేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 38 కోట్ల 20 లక్షల రూపాయలతో చేపడుతున్న రోడ్లు, భవనాలు, అమరవీరుల స్మృతివనం అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక- ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళ- శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ్య (సీతక్క), రోడ్లు- భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు, పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, శాసన మండలి సభ్యులు బల్మూరి వెంకటేష్, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు లతో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆదివాసుల ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. ఐ.టి.డి.ఎ. ద్వారా గిరిజన ఆవాసాలకు 27 కోట్ల నిధులతో రహదారులు, వంతెనల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విద్యాభివృద్ధిలో భాగంగా 5 కోట్ల రూపాయలతో ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేయడం జరిగిందని, ఇంద్రవెల్లి మండల కేంద్రంలో స్మృతివనం (అమరవీరుల స్థూపం) వద్ద 1 కోటి రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో గ్రామీణ త్రాగునీటి సరఫరా ప్రాజెక్టు క్రింద కెరమెరి మండలంలో 60 కోట్ల రూపాయల వ్యయంతో ధనోరా నీటి శుద్ధి కేంద్రం పనులకు శంఖుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. అమరుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఇంటి స్థలం, ఇండ్ల పంపిణీలో భాగంగా ఇంద్రవెల్లి




మండలం ముత్నూర్ గ్రామంలో 15 మంది అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యతనిస్తూ సంక్షేమం, అభివృద్ధి కొరకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎంతో చారిత్రాత్మక ఘనత కలిగిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని, 5 లక్షల రూపాయల ఇంటి స్థలం, ఇండ్లను అమరుల కుటుంబాలకు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటు తరువాత మొట్టమొదటి సారి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని సందర్శించి మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం జరుగుతుందని, ఆనాటి పోరాటయోధుల ఆలోచనలను ఈ ప్రభుత్వం తూ.చ. తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్, ఐటిడిఏ పిఓ ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ అలాం, ఆదిలాబాద్ శాసన సభ్యులు పాయల్ శంకర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు ఆత్మగౌరవంతో బతకాలనేదే తమ**

**ప్రభుత్వ ఉద్దేశ్యం...**

మహిళలు ఆత్మగౌరవంతో బతకాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ లోని నాగోబా దర్బార్ హాల్ లో మహిళా స్వయం సహాయక సంఘాలతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గతంలో వైఎస్సార్ సిఎం గా ఉన్నప్పుడు మహిళలకు పావలా వడ్డీకి రుణాలు ఇచ్చారని గుర్తు చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి సిఎం గా ఉన్నప్పుడు జీరో వడ్డీకే రుణాలు ఇచ్చారనీ అన్నారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.1200 ఉందని, త్వరలో మహిళలకు రూ.500లకే ఇస్తామని తెలిపారు. స్కూల్ యూనిఫామ్లు కుట్టే అవకాశం స్వయం సహాయక బృందాలకే కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ బిల్లులు కూడా ఎక్కువగా వస్తున్నాయన్న సీఎం.. త్వరలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 1450 డ్వాక్రా సంఘాలకు సుమారు రూ.60 కోట్లకుపైగా రుణాలను సిఎం బ్యాంక్ లింకేజి కింద పంపిణీ చేశారు. ఫార్మర్ ప్రొడ్యూస్ కంపెనీ 25 లక్షలు, కేస్లాపూర్ నాగోబా ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.7 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు ముఖ్యమంత్రి నాగోబా ఆలయంలో నాగోబా కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదరిక నిర్మూలన సంస్థ, వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ను సందరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్, ఐటిడిఏ పిఓ ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ అలాం, ఆదిలాబాద్ శాసన సభ్యులు పాయల్ శంకర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

http://vaasthavanestham.com

# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



# స్థానిక వార్తలు

## గిరిజన గుడాలలో అన్ని వసతులు కల్పించాలి

**వాస్తవ నేస్తం,ముధోల్:** గిరిజన గుడాలకు వసతులు కల్పించాలి జన సేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు సుంకెట మహేష్ బాబు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల ఇంద్రవెల్లి గ్రామంలో భహిరంగ సభ కు విచ్చేస్తున్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గిరిజన గుడాల్లో నివసిస్తున్న ఆదివాసులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. గిరిజన గుడాలలో,ఆదివాసీ, గోండు,లంబాడీ బిడ్డల బతుకులు చాలా ఘోరంగా వున్నాయి అని అన్నారు. వర్షాకాలం వస్తె గుడెలకు వెళ్ళాలంటే పడవల ద్వారా ప్రాణం గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణం చేయవలసిన పరిస్థితి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజన గూడల్లో అన్ని వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు.

## చిల్లర డబ్బుల విషయంలో గొడవ.. ఒకరు మృతి



**వాస్తవ నేస్తం,ముధోల్:** ఇద్దరు మిత్రులు కలిసి రోజు కూలి పనులకు వెళ్ళేవారు. స్నేహితుల మధ్య చిల్లర డబ్బుల కోసం గొడవ ఒకరి మృతికి దారితీసింది.. ఈ విషాదకర సంఘటన కుబీర్ మండలంలోని పల్సి గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... యోగేష్, రమేష్ కలిసి కల్లు తాగి చిల్లర డబ్బుల విషయంలో గొడవ పడ్డారు. రమేష్ కొట్టడంతో యోగేష్ క్రిందపడి అపస్మారక స్థితిలో వెళ్లడు. స్థానికులు భైంసా ఆసుపత్రికి తీసుకు వెళ్ళగా యోగేష్ మృతి చెందాడు. కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటో డ్రైవర్లసమస్య తిరేదెప్పుడు...?

### బీసీ ఉద్యమ వేదిక జిల్లా కోఆర్డినేటర్ సుంకేట పోశెట్టి



**వాస్తవ నేస్తం,ముధోల్:** రాష్ట్రంలో ఉపాధి కరువై రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంపట్టించుకో లేక పోవడంతో ఆందోళనకు గురి అయి నిన్న ప్రజా భవన్ ముందు చేసేదేమీ లేక తన ఆటోను తగల పెట్టు కొని నిరసన తెల్పిన ఘటనలు పునరావృతం కాకుండా త్వరలోనే వీరి సమస్యలను పరిష్కారం చేసి ఆటో డ్రైవర్ ల కుటుంబాలను, రోడ్ల మీద కు రాకుండా వీరిని ఆదుకోవాల్సిన, నైతిక బాధ్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని బీసీ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆటో డ్రైవర్ ల కుటుంబాలతో కలిసి ఆందోళన బాట పడతామని ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ సుంకెట పో శెట్టి అన్నారు.

## సర్పంచ్ వార్డు సభ్యులకు ఘన సన్మానం



**వాస్తవ నేస్తం,భీంపూర్:** ఇటీవల పదవి కాలం పూర్తి చేసుకున్న భీంపూర్ మండలం గోన గ్రామ సర్పంచ్ సయ్యద్ బదర్, వార్డు సభ్యులకు గ్రామస్తులు, ఉపాద్యాయులు, పంచాయతీ కార్యదర్శి శనివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతి పనులను వారు సమర్ధవంతంగా నిర్వహించారని ఈ సందర్భంగా కో ఆప్షన్ సభ్యుడు జహూర్ అహ్మద్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కార్తిక్, ఉపాద్యాయులు ఉపేందర్, అశోక్, అంగన్వాడీ కార్యకర్త రేణుక, గ్రామస్తులు మతీన్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో యుద్ధం మృతి



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** మండలంలోని కామాగిరి గ్రామంలో విద్యుత్ ఘాతంతో ఒక యుద్ధ మృతి చెందింది. గ్రామానికి చెందిన నక్కల నారాయణరెడ్డి అనే రైతు గాంధీనగర్ శివారంలో గల తన పంట పొలంలో తన ఎడ్లను మేపుచుండగా ప్రమాదవశత్తు గెట్టు పై గల ట్రాన్స్ఫార్మర్ తీగ తగిలి ఒక ఎద్దు చనిపోయినది. దీని విలువ 40,000 లో ఉంటుందాని రైతు తెలిపాడు. నష్టపరిహారం చెల్లించి తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

## ఉపాధి కూలీలకు సత్కారం



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) శుక్రవారానికి పద్దెనిమిది సంవత్సరాలు పూర్తి చేసుకొని, పంతొమ్మిదో ఏట అడుగుపెడుతున్న సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు శుక్రవారం పని ప్రదేశంలోనే కేకు కట్ చేసి, శాలువాలతో సన్మానించారు. అనంతరం కూలీలకు మిఠాయిలు పంచారు. ఉపాది హామీ చట్టాన్ని భారత ప్రభుత్వం 2005లో ఆమోదించిందని, 2006 ఫిబ్రవరి 02న మొదటిసారిగా మహేందర్ఘర్, సిర్సా జిల్లాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ఈ పథకం ప్రారంభించబడిందని ఏపీవో వెంకటేశ్ మాట్లాడారు. ఆర్థిక సంవత్సరంలో ప్రతి కుటుంబానికి వందరోజుల పనిదినాలను కల్పించాలనే ఉద్దేశ్యంతో పదకం ప్రారంబించబడిందని పేర్కొన్నారు.

# ఒత్తిడిలోనే విజయ రహస్యం: ఇంపాక్ట్ ట్రైనర్ వాడేకర్ లక్ష్మన్

### పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై శిక్షణ ఇచ్చిన



**వాస్తవ నేస్తం,ముధోల్:** విద్యార్థులు పరీక్షలు అంటే భయపడతారు... పాస్ అవుతమా..? లేదా..? అంటూ.. ఆందోళన చెందకుండా ఏకాగ్ర తతో ఇష్టపడిచదివితే విజయం తప్ప కుండా వరిస్తుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వాడేకర్ లక్ష్మన్ అన్నారు. ముదోల్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల లో శుక్రవారం సాయంత్రం విద్యార్థులకు పరీక్షల్లో భయాందోన పోగొట్టేందుకు ప్రిన్సిపల్ ఆర్ అమృతయ్య సహకారంతో అవ గాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులో లక్ష్మన్ మాట్లాడుతూ పరీక్షలొస్తే ఒత్తిళ్లకు విద్యార్థులు గురవుతు న్నారని తల్లిదండ్రులు అంటుంటారని.. అందులో విజయ రహస్యం దాగివుందన్న సత్యన్ని గ్రహించాలన్నారు. ప్రతి విద్యార్థి ఆందోళన చెందకుండా తొమ్మిదో తరగతి పరీక్షల వలే రాయా లని సూచించారు. సమయపాలన పాటిస్తు ప్రణాళికతో చదవలన్నారు. ఏక ధాటిగా చదవకుండా గంట గంటకు విశ్రాంతి తీసుకుని చదవాలన్నారు. మేధా వులు అంతా ఎక్కడ నుంచో రాలేదని.. ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల్లో పుట్టిన వారేనని ఉద్బోధించారు. దారిలో దొరికిన రూ. వంద కన్నా.. కష్టపడి సంపాదించుకున్న రూపాయి విలువ గొప్పదన్నారు. దేవుడంటే భయం... సమాజం అంటే గౌరవం ఉండాలని, విజయం సాధించాలంటే తప్పకుండా చదవాలన్న విషయం గ్రహించాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు పరీక్షల సమయంలో వజ్రాసనం, స్కై వాకింగ్ చేస్తే.. చదుతున్న పాఠాలపై ఏకాగ్రత కుదిరి జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులచే ఆసనాలు వేయించారు. విద్యార్థుల్ని ప్రశ్నలు అడుగుతూ చక్కగా బదులిచ్చినరు. ఈ సందర్భంగా లక్ష్మన్ కు శాలువాతో సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అమృతయ్య, వైస్ ప్రిన్సిపల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు కర్ణ సాగర్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాలి బూడిదైన డబ్బు, బంగారం..





**వాస్తవ నేస్తం,ముధోల్:** భైంసా మండలంలోని హస్గుల్ గ్రామంలో షాట్ సర్క్యూట్ తో ఆనందా బాయి అనే మహిళకు ఇల్లు శుక్రవారం దగ్ధం అయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహిళ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లగా ఇంట్లో నుండి పొగలు రావడంతో గమనించిన స్థానికులు మంటలను అర్పివేశారు. ఇల్లుతో పాటు రూ.30 వేలు, రెండు తులాల బంగారం కాలి బూడిదైనట్లు బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

**ఆపత్కాలంలో అండగా ఉంటాం**

**మోహన్ రావు పటేల్**

భైంసా మండలంలోని హస్గుల్ గ్రామంలో శుక్రవారం ఆనంద భాయి అనే మహిళకు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ముధోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లె మోహన్ రావు పటేల్ కాలిన ఇంటిని పరిశీలించి బాధిత మహిళను ఓదార్చారు. ఆయన అధైర్పడవద్దని, ఆపత్కాలంలో పేదవారికి అండగా ఉంటానని బాధిత మహిళకు తన సొంత ఖర్చులతో ఇంటిని నిర్మించి ఇస్తారని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

### కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న రామ కృష్ణ



**వాస్తవ నేస్తం,కూకట్‌పల్లి:** మూసాపేట సర్కిల్ పరిధిలోని మూసాపేట లో గల ఇంటి నెం.12-4-73లో జి.హెచ్.ఎం.సి మంజూరు చేసిన అనుమతులకు విరుధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ పేరిట ఉప్పు రామ కృష్ణ కూకట్ పల్లి జోనల్ కమిషనర్, డిప్యూటీ కమీషనర్ కు గురువారం నాడు పిర్యాదు చెయ్యడం జరిగింది. డిప్యూటీ కమీషనర్ సానుకూలంగా స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పు రామ కృష్ణ మాట్లాడుతూ ఇంటి నెం.12-4-73 లో రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని అక్రమంగా మూడో అంతస్తును నిర్మిస్తున్నారని, రోడ్డును ఆక్రమించి అధిక వైశాల్యంలో భవనాన్ని నిర్మిస్తున్నారని ఆరోపించారు. కాలనిలోకి పెద్ద వాహనాల రాకపోకలకు ఈ అక్రమ నిర్మాణం అడ్డుగా ఉందని అన్నారు. కె.పి.ఎం గ్రౌండ్ లో ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా నిర్వహించే వినాయక, దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలకు ఈ అక్రమ నిర్మాణం వలన అంతరాయం కలిగే అవకాశం ఉందని అన్నారు. ఈ అక్రమ నిర్మాణంపై వెంటనే చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ కి పూర్తి ఆధారాలతో పిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

## బీజేపీ కార్యాలయం ముట్టడిలో పాల్గొన్న జిల్లా కన్వినర్ సయ్యద్ హైదర్




**వాస్తవ నేస్తం,నిర్మల్:** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ గౌరవ అరవింద్ కేజ్రీవాల్ పిలుపుమేరకు ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం ముట్టడిలో ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ పాల్గొన్నారు. చండీగఢ్ మేయర్ పీఠంను బీజేపీ అక్రమంగా గుంజుకోవడం ఆ ప్రజాస్వామికమని అన్నారు. ఆయనతోపాటు కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కకులారం శ్రీనివాస్ ఉన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, RNI NO: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com